క్లుప్తంగా

బెటాలియన్‌లో ఓపెన్ హౌస్



ఆయుధాల పనితీరు తెలుపుతున్న పోలీసులు

సిద్దవటం : మండలంలోని ఏపీఎస్పీ 11వ బెటాలియన్‌లో పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించామని అసిస్టెంటు కమాండెంటు వి. కేశవరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమాండెంటు ఎన్. శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. బెటాలియన్‌లో ఉన్న ఆయుధాలు, సాంకేతిక పరికరాల పనితీరును విద్యార్థులకు తెలియజేసినట్లు చెప్పారు.

రూ.2.34 లక్షలు పలికిన తలనీలాల వేలంపాట

సిద్దవటం : శ్రీ నిత్యపూజ స్వామికి భక్తులు సమర్పించుకునే తలనీలాల వేలం పాటను సిద్దవటంకు చెందిన కూనా విజయభాస్కర్ రూ.2.34 లక్షలకు దక్కించుకున్నారని ఆలయం ఈఓ మోహన్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని లంకమల్ల అడవుల్లో వెలసిన శ్రీ నిత్యపూజస్వామి ఆలయంలో కార్తీక మాసంలో భక్తులు తలనీలాల పోగు హక్కు కోసం శుక్రవారం సిద్దవటంలోని శ్రీ రంగనాయక స్వామి ఆలయంలో బహిరంగ వేలం పాటను నిర్వహించారు. ఇందులో సిద్దవటం ఎగువపేటకు చెందిన విజయ భాస్కర్ రూ.2.34 లక్షలకు వేలం పాడి హక్కును దక్కించుకున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో రాజంపేట దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శివయ్య, ఆలయ చైర్మన్ పాటూరు కొండారెడ్డి, సిబ్బంది చంద్ర తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నేరం



మాట్లాడుతున్న ఎంపీపీ చీర్ల నాగమ్మ

ఓబులవారిపల్లె : బాల్య వివాహాలు నేరమని ఎంపీపీ చీర్ల నాగమ్మ అన్నారు. బాల్య వివాహాలపై గ్రామీణులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బాల్యవివాహాల రహిత భారతదేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలు ఇంకా చాలామంది అవగాహన రాహిత్యంతో వివాహ వయసు రాకుండానే వివాహాలు చేస్తున్నారన్నారు. దేశంలో బాల్య వివాహాలను నివారించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఎంపీడీఓ విజాయారావు మాట్లాడుతూ బాల్య వివాహాలు ఎక్కడ జరిగిన అరికట్టేందుకు సిబ్బంది పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వక్ఫ్ బోర్డు డైరెక్టర్ సుంకేసుల రఫీ, ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్ అనసూయమ్మ, ఎంపీటీసీ కాగితపు సుజాత, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌ఓలు, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అనంతంపల్లె సర్పంచ్‌గా ఆరె మహాలక్ష్మి



ప్రమాణస్వీకారం చేస్తున్న ఆరె మహాలక్ష్మమ్మ

పెనగలూరు : మండలంలోని అనంతంపల్లె సర్పంచ్‌గా ఆరె మహాలక్ష్మి శుక్రవారం నూతన సచివాలయంలో ప్రమాణ స్వీకారం చేశారు. అనంతంపల్లె సర్పంచ్ ఎన్నికలలో సర్పంచ్ పదవికి పెనిగలపాటి పార్వతమ్మ, ఆరె మహాలక్ష్మిలు నామినేషన్‌లు వేశారు. అప్పట్లో గ్రామ పెద్దలు ఇద్దరినీ కూర్చోబెట్టి చెరి రెండున్నర సంవత్సరాలుపాటు పదవి అనుభవించేటట్లు ఒప్పందం కుదుర్చారు. ఇందులో భాగంగా ప్రస్తుత సర్పంచ్ పెనిగలపాటి పార్వతమ్మ సర్పంచ్ పదవికి రాజీనామా చేయడంతో ఆమె స్థానంలో ఉపసర్పంచ్‌గా ఉన్న మహాలక్ష్మి సర్పంచ్‌గా ప్రమాణస్వీకారం చేశారు.

వ్యాసరచన పోటీలు

సిద్దవటం : మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో మండల స్థాయిలో విద్యార్థులకు శుక్రవారం వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించినట్టు ఎంఈఓ శంకరయ్య తెలిపారు. వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన మేఘన, వసంత, పల్లవి, వక్తృత్వ పోటీల్లో గెలిచిన చంద్రిక, గీతాంజలి, మేఘనలకు బహుమతులు అందజేశారు.

ప్రజారోగ్య పరిరక్షణే సీఎం జగన్ లక్ష్యం

- దిగువ రాచపల్లెలో ఆర్బీకే, వైఎస్సార్ విలేజ్ క్లినిక్ ప్రారంభం
- జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే మేడా, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి



రాయచోటి టౌన్: ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే మేడా, జెడ్పీ చైర్మన్ ఆకేపాటిలు

వీరబల్లె (రాయచోటి టౌన్) : ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డిలు అన్నారు. శుక్రవారం వీరబల్లె మండల పరిధిలోని వంగిమళ్ల గ్రామంలోని దిగువ రాచపల్లెలో నిర్మించిన సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ క్లినిక్‌లను వారు ప్రారంభించారు. అనంతరం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే మేడా మల్లిఖార్జునరెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా అనేక రకాల జబ్బులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు కూడా ఉచితంగా అందిస్తున్నారని చెప్పారు. వీటిలో దీర్ఘకాలిక జబ్బులు ఉన్న వారికి ఆపరేషన్‌లను చేయించి వైద్యం అందించేందుకు చర్యలు చేపట్టారని తెలిపారు. ప్రజల సంక్షేమం కోసం, ప్రజల అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తున్న సీఎం జగన్ పది కాలాల పాటు కొనసాగే విధంగా ప్రజలు ఆశీర్వదించాలని జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్‌లు సరస్వతమ్మ, నాగులమ్మ, ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథరెడ్డి, జెడ్పీటీసీ శివరాం గౌడ్, మండల వైఎస్సార్‌సీపీ నాయకులు గాలివీటి వీరనాగిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, జయచంద్రారెడ్డి, సొసైటీ అధ్యక్షులు రామోహన్‌రెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యసురక్ష క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలి – మున్సిపల్ కమిషనర్

రాయచోటి అర్బన్ : జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్ పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని బండ్లపెంట, కె.రామాపురం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో జరుగుతున్న మెడికల్ క్యాంపులను ఆయన 21వ వార్డు కౌన్సిలర్ సబిత, 32వ వార్డు కౌన్సిలర్ లక్ష్మీదేవిలతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలందరి ఆరోగ్య పరిరక్షణ కోసమే జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులను నిర్వహిస్తోందన్నారు. ప్రతి ఇంటి ముంగిటకు వైద్యం అందించాలన్న సదుద్దేశ్యంతో ప్రభుత్వం ఆరోగ్య సురక్ష క్యాంపులను నిర్వహిస్తోందన్నారు. ఆరోగ్య సురక్ష శిబిరాలలో నయం చేయలేని రోగాలకు మరింత మెరుగైన వైద్యం అందించేందుకు వైద్యాధికారులు ఆరోగ్యశ్రీ రెఫరల్ ఆసుపత్రులకు రోగులను రెఫర్ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ మల్లిఖార్జున, వైఎస్ఆర్‌సీపీ నేతలు మహేశ్వరరెడ్డి, బుజ్జిబాబు, ఖాదర్‌వలితో పాటు మెడికల్, ఐసీడీఎస్, సచివాలయం అధికారులు, ఏఎన్ఎంలు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమమే సీఎం ధ్యేయం

పెనగలూరు : ప్రజల సంక్షేమమే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ధ్యేయమని రాష్ట్ర స్కిల్ డెవలప్మెంట్ చైర్మన్ కొండూరు అజయ్ రెడ్డి అన్నారు. శుక్రవారం అనంతంపల్లె సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా ఆరోగ్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నిరంతరం ప్రజల సంక్షేమాన్ని, వారి ఆరోగ్యాం గురించి ఆలోచించి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం తీసుకొచ్చారన్నారు. సురక్ష కార్యక్రమం పేదలందరికీ వరంలాంటిందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా మండలంలో దాదాపు 5 వేలకుపైగా వైద్య సేవలు ప్రజలు పొందారన్నారు. వైద్య శిబిరానికి వచ్చిన ప్రతి ఒక్కరికీ షుగర్, బీపీ, కంటి పరీక్షలు నిర్వహించి వారికి తగిన మందులను ఉచితంగా అందజేశామన్నారు. 14 పంచాయతీలలో ఈ కార్యక్రమం ద్వారా 78 మందిని ఆరోగ్య శ్రీ పథకం ద్వారా కార్పొరేట్ ఆసుపత్రులకు వైద్యులు రెఫర్ చేశారన్నారు. డాక్టర్ తౌషీఫ్ ఆధ్వర్యంలో వైద్య బృందం వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వరప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ మురళీకృష్ణ, డాక్టర్ల బృందం, సర్పంచ్ మహాలక్ష్మమ్మలతో పాటు సచివాలయ సిబ్బంది, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీలు తదితరులు పాల్గొన్నారు.



రాయచోటి అర్బన్: రోగులకు మందులు అందజేస్తున్న మున్సిపల్ కమిషనర్ తదితరులు



పెనగలూరు: శిబిరాన్ని ప్రారంభిస్తున్న కొండూరు అజయ్ రెడ్డి

వేలంపాట రద్దు

చిన్నమండెం : మండల పరిధిలోని దేవగుడిపల్లె గ్రామ పంచాయతీ మాండవ్యా నది ఒడ్డున వెలసిన శ్రీ మండెం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో జరిగిన వేలంపాటలను వాయిదా వేస్తున్నట్లు దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ జనార్ధన్‌రెడ్డి తెలిపారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న చింతచెట్లు, కానుగ చెట్లు, వేప చెట్లను వేలం పాట నిర్వహించారు. రూ.2 లక్షల విలువైన చెట్లను తక్కువ ధరకు వేలం పాడటంతో ఇన్‌స్పెక్టర్ జనార్ధన్‌రెడ్డి, ఈఓ కొండారెడ్డిలు వేలంపాటను రద్దు చేసి డిసెంబర్ నెలకు వాయిదా వేసినట్లు ప్రకటించారు.

నేడు ఆక్రమణల తొలగింపు

పుల్లంపేట : ఆక్రమణలను ఉపేక్షించేదిలేదని తహసీల్దార్ నరసింహకుమార్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని చిట్వేలి రహదారిలో ఆక్రమణలపై జిల్లా కలెక్టర్ ఆదేశాలతో శనివారం పోలీసు బందోబస్తు మధ్య ఆక్రమణలు తొలగించనున్నట్లు తహసీల్దార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆక్రమణదారులకు పలుమార్లు నోటీసులు జారీ చేసిన స్పందించకపోవడంతో జిల్లా కలెక్టర్ ఆదేశాలతో నేడు ఆక్రమణలు తొలగిస్తామని తెలియజేశారు.

భద్రకాళికి రాహుకాల పూజలు

రాయచోటి టౌన్ : శ్రీ భద్రకాళి అమ్మవారికి రాహుకాల పూజలు భక్తిశ్రద్ధలతో జరిపారు. శుక్రవారం అమ్మవారికి రాహుకాల పూజలలో భాగంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి పూలు, ఆభరణాలు, పట్టువస్త్రాలు, నిమ్మకాయలతో తయారు చేసిన హారాలతో అలంకరించారు. పూజలలో మహిళలు నిమ్మకాయలపై వత్తులు వెలిగించి హారతులు పట్టారు. పూజలలో స్థానిక భక్తులతోపాటు కన్నడ భక్తులు విశేషంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో పాలక మండలి అధ్యక్షురాలు పి.విజయ, ఈఓ రమణారెడ్డిలు పాల్గొన్నారు.

ప్రతి రైతు ఈ-క్రాప్‌లో నమోదవ్వాలి



సంబేపల్లె: పంట నమోదు జాబితాను ప్రదర్శిస్తున్న విష్ణువర్ధన్ రెడ్డి, అధికారులు



సిద్దవటం: పంట నమోదు జాబితాను రైతులతో కలిసి పరిశీలిస్తున్న ఏడీఏ నాగరాజు

సంబేపల్లె : ప్రతి రైతు తాము సాగుచేసిన పంటలను ఈ-క్రాప్ ద్వారా నమోదు చేసుకోవాలని డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. శుక్రవారం సంబేపల్లె రైతు భరోసా కేంద్రంలో పంట నమోదుకు సంబంధించి సంబేపల్లె గ్రామ రైతులతో వ్యవసాయ అధికారులు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ ఖరీఫ్ పంట కాలానికి సంబంధించి రైతులు సాగు చేసిన పంటలను గ్రామ వ్యవసాయ సహాయకులతో నమోదు చేయించుకోవాలని, తద్వారా ప్రభుత్వం అందించే రాయితీలతోపాటు బీమా సదుపాయం పొందాలన్నారు. అనంతరం ఏడీఏ శ్రీలత మాట్లాడుతూ ఆర్బీకేలలో ఈ-క్రాప్ జాబితాను ప్రదర్శించామని, ఇందులో ఇంకా ఎవరైనా రైతులు పంట నమోదు చేయించుకోని పక్షంలో నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కిషోర్ నాయక్, మండల వ్యవసాయ మండలి చైర్మన్ వాసుదేవరెడ్డి, సంబేపల్లె సర్పంచ్ అంచల రామచంద్ర, ఆర్బీకే సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

ఈ–పంట నమోదు జాబితా ప్రదర్శన

సిద్దవటం : మండలంలోని పెద్దపల్లి రైతు భరోసా కేంద్రంలో ఖరీఫ్ – 2023 సంబంధించి ఈ – పంట నమోదు జాబితాను ప్రదర్శించామని బద్వేల్ సహాయ వ్యవసాయ సంచాలకులు నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈ – పంట నమోదుపై సామాజిక తనిఖీ నిమిత్తం గ్రామసభ నిర్వహించి రైతుల జాబితాను ప్రదర్శించి అభ్యంతరాలను స్వీకరించామన్నారు. రైతు పేర్లు వీడియో చిత్రీకరణ చేశామన్నారు. రైతులకు ఈ – పంట ప్రయోజనాలను వివరించినట్లు ఏడీఏ అన్నారు. రైతు భరోసా సహాయకులు ప్రేమ్ సందీప్, రైతులు, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు, రైతు భరోసా కేంద్ర మిత్ర పాల్గొన్నారు.

పరామర్శ

నందలూరు (రాజంపేట) : నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీ పరిధి అరవపల్లిలోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ నగర్‌లో నివసిస్తున్న మండల ఆటో యూనియన్ అధ్యక్షుడు దారా భాస్కర్ తల్లి దారా భాగ్యమ్మ (62) గురువారం మరణించగా, మండల ఎంపీపీ మేడా విజయభాస్కర్ రెడ్డి శుక్రవారం ఆమె నివాసానికి వెళ్లి ఆమె చిత్రపటానికి నివాళి అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

బీఎల్‌ఓలతో సమావేశం

పుల్లంపేట : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం తహసీల్దార్ నరసింహ కుమార్ బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో డిసెంబర్ 9వ తేదీ వరకు చేర్పులు, మార్పులు చేసుకోవచ్చన్నారు. నవంబర్ 4, 5వ తేదీలలో, డిసెంబర్ 2,3వ తేదీలలో ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తామని, ఏవైనా ఓటర్ల జాబితాలో తప్పులు ఉంటే సవరించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ నవీన్, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

గుంతలను బాగుచేయరూ..



జాతీయ రహదారిపై ఏర్పడ్డ గుంత

చిన్నమండెం : మండల పరిధిలోని రాయచోటి – మదనపల్లె జాతీయ రహదారిపై ఏర్పడ్డ గుంతలను బాగు చేయాలని పలువురు వాహనదారులు కోరుతున్నారు. జాతీయ రహదారి కావడంతో నిత్యం వందలాది వాహనాలు వెళ్తుంటాయి. కేశాపురం దేవలంపేట సమీపంలో నెలకొన్న గుంతతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ గుంత వాహనం దగ్గరికి వచ్చేదాకా కనపడకపోవడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి గుంతలను బాగు చేయాలని కోరుతున్నారు.

అన్ని వసతులతో మెరుగైన పునరావాసం

మంగంపేట ఆర్‌ఆర్–5లో మౌలిక వసతులను పరిశీలించిన కలెక్టర్ గిరీషా పీఎస్, ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు



ఆర్‌ఆర్ - 5లో పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ గిరీషా పీఎస్, ప్రభుత్వ విప్ కొరముట్ల

ఓబులవారిపల్లె : మంగంపేట కాపుపల్లె, హరిజనవాడ, అరుంధతివాడ మూడు గ్రామాల ప్రజలకు అన్ని వసతులతో మెరుగైన పునరావసం కల్పించేందుకు చర్యలు తీసుకున్నట్లు ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం మంగంపేట ఆర్‌ఆర్ – 5లో ఏర్పాటు చేస్తున్న మౌలిక సదుపాయలను జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు పరిశీలించారు. జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ మాట్లాడుతూ నెల రోజుల గడువు లోపు ఆర్‌ఆర్ – 5లో పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయల పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం గ్రామస్తుల కమిటీ సభ్యుల అభిప్రాయాల మేర ప్లాట్‌లను పంపిణీ చేస్తామన్నారు. ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు మాట్లాడుతూ మంగంపేట కాపుపల్లె హరిజనవాడ అరుంధతివాడ గ్రామాల పునరావాసం కోసం వేగవంతంగా పనులు జరుగుతున్నాయన్నారు. ప్రస్తుతం ఏర్పాటు చేసిన సీసీ రోడ్డు పనులను వారు పరిశీలించారు. అనంతరం గ్రామస్తులు అధికారులతో మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఓ సుదర్శన్ రెడ్డి, హౌసింగ్ డీఈ కుప్పుస్వామి, తహసీల్దార్ పుల్లారెడ్డి, ఎంపీడీఓ విజయారావు, వ్యవసాయ కమిటీ జిల్లా అధ్యక్షులు పంజం సుకుమార్‌రెడ్డి, వైఎస్సార్ పార్టీ నాయకులు గుత్తిరెడ్డి హరినాథరెడ్డి, తల్లెం రమణారెడ్డి, పులపత్తూరి రామసుబ్బారెడ్డి, తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ అమరేశ్వర్‌రెడ్డి, ఆయా గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయండి



మాట్లాడుతున్న ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు అర్బన్ : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టి అమలు చేస్తున్న నవరత్నాలు, పేదలందరికీ ఇళ్లు ప్రతి పథకం అట్టడుగున ఉన్న పేద ప్రజలకు అందేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు. స్థానిక మండల సభా భవనంలో వివిధ నిర్మాణ దశలో ఉన్న గృహనిర్మాణాలు, పంచాయతీరాజ్ భవనాలు, ఆర్‌అండ్‌బీ శాఖలపై నియోజకవర్గంలోని ఎంపీడీఓలు, హౌసింగ్ సిబ్బంది, అన్ని శాఖల ఇంజనీర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా రూ. 2 వేల కోట్లతో నిర్మాణ దశలో ఉన్న పలు భవనాలు, జగనన్న కాలనీలలోని గృహాలు, రోడ్లు, పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేద ప్రజల అభ్యున్నతి కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. ఆయన ఆలోచనలు, లక్ష్యాలకు అనుగుణంగా పూర్తిస్థాయిలో పని చేసి ప్రతి ఒక్కరం పేద ప్రజలకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్ రెడ్డి, ఉప సర్పంచ్ శివసాయి, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్ రాజు, డీఈలు కుప్పుస్వామి, బాలనరసింహులు, ఐదు మండలాల ఎంపీడీఓలు, అధికారులు పాల్గొన్నారు.

నేడు అత్తిరాలలో గిరి ప్రదక్షిణ

రాజంపేట రూరల్ : శైవ పుణ్యక్షేత్రమైన అత్తిరాలలో శనివారం సాయంత్రం 6 గంటల నుంచి గిరి ప్రదక్షిణ చేపడుతున్నట్లు గిరి ప్రదక్షిణ కమిటీ సభ్యులు శుక్రవారం తెలియజేశారు. అలానే బాహుదానది వద్ద గంగా హారతి కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రదక్షిణ సమయంలో వినాయకస్వామి గుడి వద్ద భక్తులకు తీర్థ ప్రసాదాలను రవి ఆచారి, కార్యక్రమం అన్నప్రసాదాన్ని యూపీ రాయుడు రాఘవరెడ్డి వెంకటేశ్వర రెడ్డి బస్సు సౌకర్యం ఏర్పాటు చేశారన్నారు.

అపరిచిత వ్యక్తులకు డబ్బులు ఇవ్వొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ జనార్ధనరెడ్డి

రాజంపేట రూరల్ : గృహ, వాణిజ్య నిర్మాణ పనుల వద్దకు వచ్చే అపరిచిత వ్యక్తులకు డబ్బులు ఇవ్వొద్దని మున్సిపల్ కమిషనర్ ఎం.జనార్దన్‌రెడ్డి తెలియజేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ఇదే విషయంపై అధికారులు, నిర్మాణదారులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణ పరిధిలో నిర్మాణాలు చేపడుతున్న వారు అనుమతుల కోసం మున్సిపల్ కార్యాలయంలో మాత్రమే నగదును చెల్లించాలని కోరారు. నిర్మాణాల వద్దకు వచ్చి అనుమతుల కోసం నగదును డిమాండ్ చేసే అపరిచిత వ్యక్తులపై తమకు గాని పోలీసులకు గాని ఫిర్యాదు చేయాలని కోరారు. సెలవు దినములలో సైతం అపరిచిత వ్యక్తులు అనుమతుల కోసం నగదు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అపరిచిత వ్యక్తులతో నిర్మాణదారులు అప్రమత్తంగా ఉండాలని తెలియజేశారు.

ఉత్తమ విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు

నందలూరు (రాజంపేట) : 2022–23 సంవత్సరంలో పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. టంగుటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన నల్లబోతుల ఇందు, పఠాన్ హౌజియా, ఆనాల నందిని శ్రీలకు ఆ పాఠశాల పూర్వపు విద్యార్థి అల్లం వెంకట సుబ్రమణ్యం వారి తల్లిదండ్రులు అచ్చమ్మ, అల్లం తిరుమలయ్య జ్ఞాపకార్థం పాఠశాల కమిటీ చైర్మన్లు రజనీ, మురహరిల చేతులమీదుగా శుక్రవారం నగదు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీనివాసులు మాట్లాడుతూ పదోతరగతిలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు రూ. 2500లు, రూ. 1500లు, రూ. 1000లు అందజేసినట్టు తెలిపాన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఛాన్ బాషా, రజనీ, శశికళ, మోహన్ రాజు, లక్ష్మీనారాయణ రెడ్డి, లక్ష్మీదేవి, మస్తాన్ రెడ్డి, రమేష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న నాయకులు, కామసాని వంశస్థులు

గాలివీడు : మండల పరిధి పందికుంట గ్రామం వెంకటేశ్వర నగర్‌లో శ్రీ వేంకటేశ్వర స్వామి నూతన ఆలయ నిర్మాణానికి కామసాని వంశస్థులు వేద పండితులచే భూమి పూజను శుక్రవారం నిర్వహించారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి కృషితో రూ. 50లక్షలు మంజూరు చేయించడంతో నూతన ఆలయం నిర్మాణానికి ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు కార్యక్రమానికి హాజరయ్యారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుకే



బ్రీతింగ్ అనలైజర్ పరీక్ష చేస్తున్న ఎస్ఐ నరసింహారెడ్డి

రాయచోటి టౌన్ : మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుకు పంపుతామని రాయచోటి అర్బన్ ఎస్ఐ నరసింహారెడ్డి వాహనదారులను హెచ్చరించారు. శుక్రవారం వాహనాల తనిఖీలు నిర్వహించారు. వాహనదారులకు సూచనలు, సలహాలు అందించారు. ద్విచక్రవాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని సూచించారు. వాహనదారుల నుంచి వాహనాలకు సంబంధించిన రికార్డులు పరిశీలించి పలు వాహనాలకు జరిమానా విధించారు. వాహనాల తనిఖీలలో ఏఎస్ఐ జోసెఫ్, కానిస్టేబుల్ ఏవీ రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

శాస్త్రీయ విజ్ఞానాన్ని వెలికితీసేందుకే 'చెకుముకి'



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

సంబేపల్లె : చిన్ననాటి నుంచి విద్యార్థులలో శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించాలని జన విజ్ఞాన వేదిక జిల్లా యూత్ కన్వీనర్ వినయ్ కుమార్ సూచించారు. శుక్రవారం సాయంత్రం సంబేపల్లెలోని జెడ్పీహెచ్ఎస్‌లో చెకుముకి సైన్స్ సంబరాల కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చెకుముకి సైన్స్ సంబరాలలో విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో పాల్గొనేటట్లు వారిని ప్రోత్సహించాలని ఉపాధ్యాయులకు విజ్ఞప్తి చేశారు. అనంతరం హెచ్ఎం నరసింహారెడ్డి మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో నవంబర్ 10న, మండలస్థాయిలో నవంబర్ 30న చెకుముకి సైన్స్ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక మండల అధ్యక్షుడు శంకరయ్య, జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్ రెడ్డి, జేవీవీ నాయకులు హేమంత్, జిల్లా ట్రెజరర్ పూజారి రామయ్య, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా జోలికి వెళితే చర్యలు



వై.కోట గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ

ఓబులవారిపల్లె : నాటుసారా జోలికి వెళితే కఠిన చర్యలు తప్పవని రైల్వేకోడూరు సీఐ మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వైకోట గ్రామంలో రాజంపేట డీఎస్పీ చైతన్య ఆదేశాల మేరకు సీఐ మధుసూదన్ రెడ్డి, ఎస్ఈబీ ఎస్ఐ నరసింహులు సిబ్బందితో కలిసి ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. సీఐ మట్లాడుతూ గ్రామంలో గొడవలకు పాల్పడిన నాటుసారా జోలికి వెళ్లిన ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. అనంతరం వాహనలు తనిఖీ నిర్వహించి అనుమానస్పదంగా ఉన్న వాహనాలను అదుపులోకి తీసుకున్నారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.